రైతులకు న్యాయం చేయాలి

కుభీర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో కుభీర్, లోకేశ్వరం, మండలాల రైతుల నుంచి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేశారు. దాదాపు కోటి రూపాయలకు పైగా రైతులకు చెల్లించాల్సి ఉంది. ఎగ్గొట్టి పరారయిన సీఈవో సంగి శ్రీనివాస్‌తో పాటు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కర్త డా. కిరణ్‌కొమ్రెవార్ డిమాండ్ చేశారు. బాధిత రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కుభీర్, లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ విచారించారు. నిందితులను పట్టుకొని న్యాయం చేస్తామన్నారు.

ఈదురు గాలుల బీభత్సం


దస్తురాబాద్ మండల కేంద్రంలో నేల కొరిగిన భారీ వృక్షం


నిర్మల్‌లో భారీ వృక్షం విరిగి పడడంతో ఇంట్లో చిక్కుకున్న వృద్ధురాలిని బయటకు తెస్తున్న శివంగి బృందం


కుసుంపూర్‌లో ఈదురు గాలుల బీభత్సానికి నేల కూలిన ఇల్లు


ఎల్లాపూర్ వద్ద విరిగి పడిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు, స్థానికులు



- జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం
- పలుచోట్ల నేలకొరిగిన భారీ వృక్షాలు
- కూలిన ఇళ్లు, విరిగి పడిన విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు
- మృత్యువాత పడిన పశువులు
- జిల్లాలో 31.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు
- అత్యధికంగా కుభీర్ మండలంలో 69.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- జిల్లా కేంద్రంలో టీం శివంగి బృందం సహాయక చర్యలు

ఖానాపూర్, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈదు రు గాలులతో కూ డిన వర్షం కురి సింది. ఒక్కసారిగా భారీగా ఈదురు గాలులు రావడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. జిల్లావ్యాప్తంగా 31.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గత వారం రోజులుగా తీవ్ర ఉక్కపోతగా ఉన్న వాతావరణంలో మార్పుచోటు చేసుకుంది. ఈదురు గాలుల బీభత్సానికి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులు ధ్వంసమయ్యాయి. జిల్లాలోని కుభీర్ మండలంలో అత్యధికంగా 69.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్ల డించారు.

నేలకొరిగిన భారీ వర్షాలు..
విరిగి పడిన విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు..

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం సోమవారం రాత్రి ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. భారీగా వీచిన ఈదురు గాలులకు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల భారీవృక్షాలు నేలకొరిగాయి. జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురివాడ, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. నిర్మల్, మంచిర్యాల రహదారిపై చెట్లు పెద్ద ఎత్తున విరిగిపోవడంతో సోమవారం రాత్రి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల బీభత్సానికి జిల్లావ్యాప్తంగా పలు చోట్ల ఆస్తినష్టం జరిగింది. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురివాడలో ఓ సెల్‌టవర్ విరిగిపడింది. ఖా నా పూర్ మండలంలోని కొలాం గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్‌లో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడడంతో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం సైతం జిల్లాలోని పలు మండలాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో కరెంటు సరఫరాను నిలిపివేశారు.

కుసుంపూర్‌లో కూలిన ఇళ్లు

ఈదురు గాలుల బీభత్సానికి ఖానాపూర్ మండలంలోని కొలాంగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల కుసుంపూర్‌లో ఆత్రందుర్గు అనే వ్యక్తి ఇళ్లు కూలి పోయింది. ఈదురు గాలుల తీవ్రతకు ఇంటిపై కప్పు కూలుతుండగా దుర్గు కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఇంట్లోంచి బయటికి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఇరువురికి గాయాలయ్యాయని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఆరు బయట కట్టేసి ఉన్న ఆవు ఈదురుగాలుల బీభత్సానికి మృత్యువాత పడినట్లు దుర్గు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వచ్చిన ఈదురు గాలులు తమ కుటుంబాన్ని వీధిపాలు చేశాయని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తమకు సహాయం అం దించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ఖానాపూర్ మండలం కుసుంపూర్‌లో మృత్యువాత పడిన ఆవు

విపత్కర పరిస్థితుల్లో టీం శివంగి సహాయక చర్యలు

ప్రకృతి ప్రకోపానికి జిల్లా అతలా కుతలమైన వేళ జిల్లాలో పోలీసుల సహాయక చర్యలను పలువురు అభినందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి వాడలో భారీ వృక్షాలు నేలకొరగడంతో టీం శివంగి బృందం ముమ్మరంగా సహాయక చర్యలు నిర్వహించింది. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా మహిళా కానిస్టేబుళ్లు ఎదుర్కొనే విధంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల దృఢ సంకల్పంతో ఏర్పాటైన టీం శివంగి బృందం ప్రకృతి సృష్టించిన బీభత్సం నుండి ప్రజలు త్వరగా తేరుకునేలా యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ఖానాపూర్ మండలంలో నిర్మల్, మంచిర్యాల రహదారిపై మస్కాన్ ఎల్లాపూర్ సమీపంలో నేలకొరిగిన భారీ వృక్షాలను ఎస్సై రాహుల్ ఆధ్వర్యంలో స్థానికుల సహాయంతో పోలీసులు తొలగించారు. ఈ రెండు ఘటనల్లో పోలీసులు సకాలంలో స్పందించి ప్రజలు మరింత ఇబ్బంది పడకుండా సహాయక చర్యలు అందించారు. పోలీసుల సహాయక చర్యలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.


జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి వాడలో విరిగి పడిన సెల్‌టవర్

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



లక్ష్మణచాంద, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈ వర్షంతో పాటు వీచిన ఈదురుగాలులకు రోడ్లకు ఇరువైపులా హరిత హారం చెట్లు, విరిగిపడ్డాయి. రోడ్లకు ఇరువైపులా గల చెట్లు విరిగి నడిరోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విత్తనాలు విత్తే పనులు వాయిదా పడ్డాయి. వేగంగా వీచిన గాలులకు ఇళ్లకు గల కిటికీలు గోడలకు కొట్టుకుని పగిలిపోయాయి. రోడ్డుపై పడిన చెట్లను తొల గించటంలో స్థానిక వ్యవస్థ విఫలమైందని పలువురు వ్యాఖ్యానించారు.


మోదీ పాలనలో
భారత్ అన్ని రంగాల్లో దూసుకుపోతోంది

- కేంద్రం సాధించిన విజయాలను ప్రతి పల్లె పల్లెన ప్రజలకు వివరించాలి
- బీజేపీ మండలాధ్యక్షులు పుప్పాల ఉపేందర్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు ఉపేందర్

ఖానాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని బీజేపీ ఖానాపూర్ మండలాధ్యక్షులు పుప్పాల ఉపేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ మండల శాఖ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నాయిని సంతోష్‌తో కలిసి పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ సహా కేంద్రం సాధించిన ఘనతలను, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి పల్లె పల్లెన ప్రజలకు పార్టీ శ్రేణులు వివరించాలన్నారు. ఈ నెల 21వ తేదీన యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆదేశాల మేరకు ప్రతి బూత్ స్థాయిలో పై కారయక్రమాలను విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి బీజేపీ కార్యకర్త ఓ సైనికుడి వలే కదిలి అమ్మ పేరిట ఒక మొక్కను నాటి ఆ మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం రవీందర్, కార్యక్రమ కన్వీనర్ పవన్, బీజేపీ మండల నాయకులు లింబాద్రి, వరుణ్, రమేష్, నరేందర్, చంద్రశేఖర్, రాజేందర్, గంగారాజం, రఘు, స్వామి, భూమా గౌడ్, వెంకట్రాములు, హన్మంతు, భీమేష్, వెంకటేష్, పోశెట్టి, శ్యామ్, కృష్ణ పోతరాజు, మహేందర్, రమేష్, శంకర్, రాజేశ్వర్, రవీందర్, నరేష్, గంగారెడ్డి, శ్రీనివాస్, నరేందర్, తదితరులున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని ఫొటో ఏర్పాటు


మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని మోదీ ఫోటోను గోడకు తగిలిస్తున్న బీజేపీ పట్టణ అధ్యక్షులు మనోజ్

ఖానాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఫోటోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కీర్తిమనోజ్ మాట్లాడుతూ... గతంలో పలుమార్లు కార్యాలయంలో ప్రధాన మంత్రి ఫోటోతో పాటు ఎంపీ ఫోటోను ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో తామే స్వయంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ల ఫోటోలను ఏర్పాటు చేసిన అధికారులు ప్రధానమంత్రి మోదీ, స్థానిక ఎంపీ నగేష్‌ల ఫోటోలను ఏర్పాటు చేయాలని కోరితే పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తామే స్వయంగా కార్యాలయంలో ప్రధాని ఫోటోను ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావు, జెట్టి సురేందర్, సందుపట్ల శ్రావణ్, కొండవేని రమేష్, దాసరి శ్రీనివాస్, పంబాల ప్రశాంత్, బి. సుమంత్, తదితరులున్నారు.

అటవీప్రాంతాల్లో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అటవీప్రాంతాల్లో అభి వృద్ధి పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, అటవీ, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన, అటవీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, విద్యుత్ వంటి మౌళిక వసతుల కల్పన కోసం శాఖలు అటవీశాఖకు ప్రపోజల్స్ పంపించాలని సూచించారు. అభివృద్ధి పనులకు అటవీశాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, ప్రతీశాఖ పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. విద్యుత్ లైన్లు ఏర్పాటుకు పరివేష్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని అధికారులకు స్పష్టంగా తెలిపారు. చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మార్గదర్శకాలను ఇతర శాఖలకు అటవీశాఖ వేగంగా పంపించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా అటవీ అధికారి నాగిని భాను, ఆర్డీవో రత్నకల్యాణి, సంబంధిత శాఖల ఇంజినీరింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పథకాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలి

- పార్లమెంట్ సభ్యుడు గెడం నగేష్

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పథకాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని పార్లమెంట్ సభ్యుడు గెడం నగేష్ అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ, అరణ్య శాశ్వత వ్యవసాయసంస్థ నిర్మల్ సంయుక్తంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పరంపరాగత కృషి వికాస్ వియోజనలో భాగంగా నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫామింగ్ అనే ప్రాజెక్టులో భాగంగా ప్రకృతి వ్యవసాయంలో స్థానిక విత్తనాల ప్రాముఖ్యత, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటగా అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఏర్పాటు చేసిన స్థానిక విత్తనాల ప్రదర్శనను గెడం నగేష్ సందర్శించి, వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. విత్తనాలను తెచ్చిన రైతులందరూ ఒకరికొకరు పంచుకున్నారు. తదనంతరం ప్రకృతి వ్యవసాయ వ్యవసాయం ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయంలో స్థానిక జాతి విత్తనాలు అనగా పప్పు జాతి, ధాన్యం జాతి నూనె గింజలు, విత్తనాల ప్రాముఖ్యత, వాటి మొలకెత్తె విధానం తీరు వివరాలకు సంబంధించి కొప్పుల నర్సన్న వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో నేల ఆరోగ్యాన్ని పెంచడానికి పచ్చి రొట్ట విత్తనాలను చల్లుకోవడంతో పాటు పండ్లనిచ్చే జాతులను, కలపనిచ్చే జాతులను పెట్టుకోవడం వల్ల రైతుకు వివిధ పంటల నుంచి ఆదాయం పెరగడమే కాకుండా నష్టాల బారి నుండి బయటపడవచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ జిల్లాలో 15 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తున్నామని రైతులకు శిక్షణ ఇవ్వడానికి ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లుగా జిల్లా నుండి వాళ్లందరికీ శిక్షణ కోసం పంపించి ఖరీఫ్ సీజన్ నుండి ప్రకృతి వ్యవసాయాన్ని చేసే విధంగా చెప్పారు. ఐకార్ సలహా మండలి సభ్యులు అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని రైతులందరూ మంచి ఆహార ఉత్పత్తిని సాధించాలని తద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సాంకేతిక ఏడీఏ విద్యాసాగర్, ఏడీఏ సుజాత, ఉద్యానవన డివిజనల్ అధికారి మౌనిక, పశు సంవర్ధకశాఖ అధికారి బి.రాణి, ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రామ్‌రెడ్డి, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ స్థాపకులు కొప్పుల నర్సన్న, సీఈవో పద్మ, నిర్మల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుమన్ కుమార్, ప్రకృతి వ్యవసాయ రైతులు మన్మోహన్ రెడ్డి, వాసురెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు నగేష్

దిలావర్‌పూర్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకుల దుర్మరణం


ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం


ప్రమాదంలో మృతి చెందిన అబ్రార్, షేక్ సానిఫ్ (ఫైల్)

దిలావర్‌పూర్ , జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దిలావర్‌పూర్ బస్టాండ్ సమీపంలో 61వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన అబ్రార్, షేక్ షానిఖ్ ఇద్దరు మంచి మిత్రులు. అబ్రార్ దిలావర్‌పూర్ మండల కేంద్రంలో చికెన్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా దిలావర్‌పూర్‌లో ఉన్న ఒక దాబా హోటల్ వారు చికెన్ అర్డర్ చేయడంతో ఆ చికెన్‌ను ఇచ్చేందుకు మిత్రుడు షానిఖ్‌ను తీసుకొని బైక్‌పై వెళ్లారు. దాబా హోటల్‌లో చికెన్ అందచేసి బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. మృతదేహాలు రోడ్డుపై చెల్లచెదురుగా పడ్డాయి. ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం వీరిని బైక్‌తో సహా 250 మీటర్ల మేర ఈడ్చుక వెళ్లినట్లు తెలుస్తోంది. అబ్రార్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, భార్య ఉండగా షానిఖ్‌కు 6 నెలల క్రితమే వివాహమయ్యింది. ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో దిలావార్‌పూర్ మండల కేంద్రంలో విషాదం అలుముకుంది. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

సీనియారిటీకి దక్కిన ప్రాధాన్యం
ఎంబడికి పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి


ఎంబడి రాజేశ్వర్

నిర్మల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు దశాబ్దాల నుంచి కాంగ్రెస్ పార్టీలో విధేయుడుగా కొనసాగుతున్నారు. ఎన్ఎస్ యూఐ అధ్యక్ష పదవి నుంచి మొదలుకొని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్ష పదవికి ఎదిగారు. అనంతరం స్థానికంగా ఆ పార్టీలో జిల్లా పదవులు చేపట్టిన ఎంబడి రాజేశ్వర్‌కు ఆ పార్టీ రాష్ట్రస్థాయిలో పట్టం కట్టింది. ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీకి సంబంధించిన పదవులన్నింటినీ సీనియర్లు, విధేయులకే కట్టబెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో ఎంబడి రాజేశ్వర్‌కు ఈ కీలక పదవి దక్కింది. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎంబడి రాజేశ్వర్ మాట్లాడుతూ... జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని డీసీసీ ప్రెసిడెంట్ శ్రీహరిరావుతో పాటు ఇతర సీనియర్ నాయకులు అందరితో సమన్వయంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తామని అలాగే కార్యకర్తలు అందరికీ వెన్నంటి ఉంటూ పార్టీని ముందుకు నడుపుతామన్నారు.

పత్తి విత్తనాలు విత్తుతున్న
రైతులపై తేనెటీగల దాడి

- 8 మంది రైతులకు గాయాలు


అంబులెన్సులో రైతు గోవర్దన్‌ను భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

తానూర్ , జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరీ(బి) తండాలో మంగళవారం పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులపై తేనెటీగలు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామంలో గోవర్ధన్ అనే రైతు తన చేన్లో పత్తి విత్తనాలను కూలీలతో విత్తుతున్నారు. అయితే పక్కనే చిన్నారులు బంతితో ఆడుకుంటుంటుండగా బంతి వెళ్లి చెట్టుపై ఉన్న తేనెతుట్టకు తగలడంతో ఒక్కసారిగా తేనెటీగలు చేన్లోని రైతులపై దాడి చేశాయి. ఈ దాడిలో రైతు గోవర్ధన్ ఆయన కుమారులు హరిదాస్, విలాస్, సుభాష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు, కూలీలపై దాడి చేశాయి. ఈ ఘటనలో 8 మంది తీవ్ర గాయాలతో అస్వస్థతకు గురి కాగా, వారిని 108 అంబులెన్సులో భైంసా ఏరియాసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

లోకేశ్వరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారిని అనసూయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఘనంగా వట సావిత్రి పూజలు



మర్రిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వటసావిత్రి పౌర్ణమిను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, దన్నోరా(బి), గౌరపూర్, పిప్రి తదితర గ్రామాల్లో వట సావిత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న మర్రి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేస్తూ ధారం చుట్టుకున్నారు. వట సావిత్రి పూజలు చేయడం ద్వారా తమ భర్తలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటారని వారు నమ్ముతున్నట్లు మహిళా భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా భక్తులు పాల్గొన్నారు.

..పూజల కోసం ఏర్పాట్లు

బోథ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పదో వార్డులో ఉన్న పురాతన మర్రిచెట్టు వద్ద వటసావిత్రి పౌర్ణమి సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఎర్ర మొరం పోయించారు. గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు ఆయన చట్ల ఉమేష్ కాలనీ మహిళల విజ్ఞప్తి మేరకు మొరం పోయించడం జరిగిందని కాలనీవాసులు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది మహిళలు చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తారని, అయితే ఈ ఏడాది చెత్తాచెదారంతో నిండిపోవడంతో శుభ్రం చేసి మొరం వేయడం జరిగిందని పేర్కొన్నారు. తమ కోరిక మేరకు మొరం వేసిన సామాజిక సేవకుని కాలనీవాసులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన సురేష్ వైద్య, పాలిక్ చంద్ర మోహన్, సిహెచ్ బ్రహ్మానందం తదితరులు ఉన్నారు.

కళాశాల ఆవరణలో దిగబడిన కార్గో బస్సు



దిగబడిన బస్సు బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

బోథ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తెలుగు అకాడమీ నుంచి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను తీసుకొని సాయంత్రం కార్గో బస్సు చేరుకుంది. అయితే వచ్చిన బస్సు కళాశాల మైదానంలో దిగబడడంతో ముందుకు కదలలేదు. అయితే అక్కడే ఉన్న విద్యార్థులు యువకులు బస్సును ముందుకు జరిపేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఎంతకు బయటకు రాకపోవడంతో చివరకు జెసిబిని తెప్పించి బయటకు తీయాల్సి వచ్చింది. పుస్తకాలు తీసుకువచ్చినం బస్సు బజార్హత్నూర్, ఇచ్చోడ మండల కేంద్రాల్లోని కళాశాలలకు పుస్తకాలను తీసుకెళ్లాల్సి ఉండడంతో డ్రైవర్ విషయాన్ని స్థానికులకు తెలపడంతో జెసీబీ తెప్పించి బయటకు తీశారు.

బీభత్సం సృష్టించిన గాలివాన

● ఊడిపోయిన ఇళ్ల రేకులు
● చెట్లు పడి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
● మండలంతో పాటు గ్రామాల్లో ఏర్పడిన విద్యుత్ అంతరాయం



అర్లి, అంతర్గం నడుమ పడిన చెట్లు



విద్యుత్ మరమ్మతు పనులు చేయిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఇంద్రవెల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో మండలంలోని హీరాపూర్, సుందర్‌నగర్, సట్వాజిగూడ, కేస్లాగూడ, ఏమాయికుంట, ముత్నూర్, హర్కపూర్ తదితర గ్రామాల్లో పలువురి ఇళ్లపై కప్పురేకులు ఊడిపోయాయి. దీంతో నిత్యావసర సరుకులు, బట్టలు తడిసిపోయాయని బాధితులు తెలిపారు. మండలంలోని ఏమాయికుంట గ్రామ సమీపంలో గల విజయలక్ష్మీ జిన్నింగ్ మిల్లు షెడ్డు రేకులు ఈదురు గాలులతో కొట్టుకుపోయాయి. అదే విధంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఈదురు గాలులతో విద్యుత్ వైర్లపై చెట్టు 25 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ మరమ్మతు పనులు చేసి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు.

భీంపూర్ మండలంలో..

భీంపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం గాలి వాన బీభత్సవం సృష్టించింది. అర్లి (టి) - అంతర్గం రోడ్డు పై చెట్లు విరిగి పడటంతో గంటల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అసలే అధ్వానంగా ఉన్న ఆదిలాబాద్ - కరంజి టి రోడ్డు మరింత ఘోరంగా తయారయ్యింది. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. గుబ్డి, కరంజీ (టీ) సహా పలు గ్రామాలలో కరెంటు లేక ఫోన్‌లు మూగబోయాయి. కాగా గత మూడు రోజుల గాలి వానతో విద్యుత్ లేక అంధకారంలో ఉంటున్నామని మిషన్ భగీరథ నీటికి కష్టం అవుతుందని గుబ్డి గ్రామస్తులు అన్నారు.

భూ భారతిలో సమస్యలు పరిష్కరిస్తాం

● ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్



అంజి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి భూ సమస్యలను పరిష్కరిస్తామని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండలంలోని అంజి, శంకర్‌గూడ గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, భూ సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎలాంటి భూ సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకొస్తే గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. భూ భారతిపై అధికారులకు, రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ శాఖ అధికారులు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

మార్కెట్ యార్డులో వసతుల కలనకు ప్రతిపాదనలు



బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో చైర్మన్, కార్యదర్శి

బోథ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో. వసతుల కల్పనకు తగుచర్యలు చేపట్టాలని పాలకవర్గ సమావేశం నిర్ణయించింది. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం జరిగింది. సమావేశంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ విట్టల్, వైస్ చైర్మన్ ఆడే వసంతరావుతో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మార్కెట్ యార్డు అభివృద్ధి చేపట్టాల్సిన పనుల విషయమై ఏకగ్రీవ తీర్మానాలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని చైర్మన్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు త్వరలోనే ప్రభుత్వం టెండర్లు పిలవడం జరుగుతుందని ఆయన వివరించారు. గోదాంలో అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

ఇంద్రవెల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం రాత్రి తొలకరి వాన కురవడంతో మండల రైతులు బిజీగా మారారు. మంగళవారం ఉదయం నుంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి, మొక్క జొన్న విత్తనాలు నాటడంతో పాటు దుక్కి దున్నడం, పత్తి కట్టెలు తొలగించే పనులు చేస్తూ రైతులు బిజీ బిజీగా దర్శనమిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు!

(5వ పేజీ తరువాయి)

ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎక్కడ ఇసుక రీచ్‌లు లేక పోవడంతో ఇసుక సరఫరాకు ఇబ్బందుల ఎదురవుతున్నాయి. స్థానికంగా అందుబాటులో ఉన్నే వాగుల్లో నుంచి ఇసుకను తీసుకొస్తున్న నాణ్యతగా ఉండడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. దీంతో నిర్మాణ పనులు దెబ్బతినే అవకాశం ఉంటుందని భయపడుతున్నారు. వర్షాకాలం కావడంతో బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణ పనులను చేపట్టి వదిలేస్తున్నారు. వర్షాకాలం ముగిసిన తర్వాత పనులను ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా ముందుకు సాగడం లేదు. అలాగే పంటల సాగు సీజన్ కావడంతో చేతిలో చిల్లిగవ్వలేక నిర్మాణ పనులను చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని సమాచారం.

పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు

ఉచితంగా పుస్తకాలు, దుస్తుల పంపిణీ

తలమడుగు , జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి పాఠశాల ప్రారంభమవుతున్నాయని, అదే రోజున విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తామని మండల విద్యాధికారి వెంకట్రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 55 పాఠశాలలు ఉన్నాయని, ఇందులో 3085 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈనెల 12న పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 80 శాతం దుస్తులు కుట్టడం జరిగిందని, తదితరులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మార్సీలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికుల శిక్షణ తరగతులు వారికి అవగాహన కల్పించారు. పాఠశాల ఎలాంటి పారిశుధ్యంలో పెంచకుండా ప్రతిరోజు శుభ్రపరచాలని సూచించారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన ప్రదేశాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఇందులో ఐకెపి ఎపిఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

తలమడుగు, జూన్ 10 (అంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం మండలంలోని లక్ష్యంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 69 ఇండ్లు మంజూరు కాగా రెండో విడతలో 450 ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. మొదటి విడుదల మంజూరైన ఇళ్ల పనులు 50 వరకు ప్రారంభమై బేస్మెంట్ రూఫ్ లెవెల్ వరకు పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందే విధంగా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. ఇందులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, పంచాయితీ సెక్రటరీ సంతోష్, మాజీ సర్పంచ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధితో ఆందోళన వద్ద

ఇంద్రవెల్లి , జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యంతోనే నయం అవుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పిట్టబొంగరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ప్రతాప్‌నాయక్ అన్నారు. మండలంలోని వాల్గొండ గ్రామ పంచాయితీ పరిధిలోని ఖైర్‌గూడ గ్రామానికి చెందిన ఇద్దరికి ఇటీవల కుష్టువ్యాధి నిర్ధారణ కావడంతో మంగళవారం ఖైర్‌గూడ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో గోకుల్, వైద్య సిబ్బంది జలంధర్, ప్రియాంక, విజయ్‌సుందర్, గ్రామస్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వట సావిత్రి పూజలు



భైంసాలో మర్రి వృక్షానికి పూజలు చేస్తున్న మహిళలు

భైంసా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రత పూజలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మహిళలు ఉదయం వేళలో తమ తమ నివాస గృహాల్లో పూజలు నిర్వహించి మంగళహారతులతో ఆయా కాలనీల్లోని మర్రి వృక్షాల వద్దకు భక్తి గేయాలను ఆలపిస్తూ తరలివెళ్లారు. అనంతరం మర్రి వృక్షాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కొరుకుంటూ మర్రి వృక్షాలకు ప్రదక్షిణలు చేపడుతూ దారాన్ని చుట్టారు. సాముహికంగా హారతి కార్యక్రమాలను నిర్వహించారు.పూజల అనంతరం ప్రసాదాల వితరణను చేపట్టారు. ప్రధానంగా కాటన్ మార్కెట్ యార్డు , బాగుబాయి గుట్టసాయిబాబా మందిరం, నర్సింహనగర్ కాలనీ పరిధిలోని పార్కు, సుదవాగు ప్రాంతంలోని శివాలయం ప్రాంతాల్లో గల మర్రి వృక్షాలకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి పూజలు చేపట్టారు.మహిళా భక్తుల సందడితో పట్టణ పరిధిలోని వివిధ ఆలయాలు, ఆయా ప్రాంతాల్లోని మర్రి వృక్షాలు కోలాహలంగా మారాయి.

దిలావర్‌పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వటసావిత్రి పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం మహిళలు వట వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వట వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కుంకుమార్చన చేశారు. సాక్షాత్తు వట వృక్షాన్ని అమ్మవారిగా భావించి మొక్కులు చెల్లించుకున్నట్లు మహిళలు తెలిపారు.

మోదీ పాలనతో దేశం సర్వతోముఖాభివృద్ధి

భైంసా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ పాలన దక్షతో భారత్ తిరుగులేని రీతిలో సర్వతోముఖాభివృద్ధి సాధించిందని బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు యనుపోతుల మల్లేశ్వర్ పేర్కొన్నారు. మోదీ ప్రధానిగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణ పరిధిలో పార్టీ శ్రేణులు పలు కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు యనుపోతుల మల్లేశ్వర్‌లు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణలతో యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్, కో కన్వీనర్ ముల్లవార్ అనిల్, బండారి దిలీప్‌లు మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకుంటున్న చారిత్రత్మాక నిర్ణయాలతో ప్రపంచం నివ్వెరపోయేలా భారత్ ప్రగతిబాటలో దూసుకపోతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా కిసాన్ గల్లి సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో పార్టీ ప్రతినిధులు రావుల పొశెట్టి, వడ్నప్ శ్రీనివాస్, సాహెబ్‌రావు, హన్మాండ్లు, బీమా శంకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మోదీ పాలన దేశానికి స్వర్ణ యుగం లాంటిదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు అన్నారు. బీజేపీ 11 సంవత్సరాల పాలన నేపథ్యంలో పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం రూరల్ బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు ఏనుగు వెంకట్ రెడ్డి,



గడ్డెన్న వాగు ప్రాజెక్టు



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి నీటి నిల్వలు

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరద చేరిక ప్రారంభం

● 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

భైంసా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక మొదలయ్యింది. మంగళవారం ప్రాజెక్టులోకి 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో ఇదే తొలిసారి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7మీటర్లు, 1.852 టీఎంసీలు ఉంది. కాగా ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 335.4 మీటర్లు ఉండగా 0.611 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వదర నీరు వచ్చి చేరుతుండటతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమక్రమంగా పెరుగనుంది. నీటి మట్టం క్రమక్రమంగా పెరుగనుంది. గత 8 నెలల కాలంగా నీరు అంతంత మాత్రంగానే ఉండడంతో బోసిపోయి కనిపించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు వదర నీరు వచ్చి చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటోంది.

లక్ష్మీపూర్‌లో పిడుగుపాటుతో మహిళ మృతి

భీంపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలలోని లక్ష్మీపూర్‌లో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుతో ఒక మహిళ మృతి చెందింది. వివరాలు మండలంలోని నిపాని గ్రామానికి చెందిన కలిమి నాగమ్మ (45) మంగళ వారం ఉదయం ఇదే మండలంలోని లక్ష్మిపుర్‌లో బంధువుల ఇంటిలో దశ దిన కర్మకు హాజరైంది. ఆమె తిరిగి నిపాని గ్రామానికి వచ్చేందుకు లక్ష్మి పుర్ బస్ షెల్టర్ వద్ద కూర్చొని బస్సు కోసం ఎదురు చూస్తుంది. ఈ క్రమంలో సాయంత్రం ఒక్కసారిగా గాలి వానతో పాటు ఆ ప్రాంతంలో పిడుగు పాటు జరిగింది. దగ్గరనే ఉన్న ఆమె స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. దీంతో నిపాని గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మూడు కిలోమీటర్ల దూరం ఉన్న లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్లి ఇప్పుడే వస్తానన్న నాగమ్మ తిరిగిరాని లోకాలకు వెళ్లిందని కుటుంబీకులు జీర్ణించుకోలేక పోతున్నారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

ఖానాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం ఉన్న నేపథ్యంలో పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీవో చిక్యాల రత్నాకర్ రవు ఆదేశించారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని బాదనకుర్తి, గోసంపల్లె, మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల తనిఖీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచని గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

.. పరిశీలించిన ఎంపీడీవో రాధా రాథోడ్

లక్ష్మణచాంద, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాబాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వడ్డేపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో రాధారాథోడ్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 12 నుండి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలల పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల గురించి పై అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్ వర్మ, ఎంపీవో అమీర్ ఖాన్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కుంటాల, జూన్, 10 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాస హన్మండ్లు (58) మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు హన్మండ్లు కిరాణా దుకణానికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ఒక్కసారిగా వర్షం కురియడంతో రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. నిలబడలేని పరిస్థితి నెలకొంది. గమనించిన స్థానికులు 108 లో భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

పెంచిన బస్‌పాస్ రేట్లను ఉపసంహరించుకోవాలి

భైంసా, జూన్ 10 (అంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజానీకపు ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆర్‌టీసీ సంస్థ యాజమాన్యం పెంచిన బస్ పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని భైంసా డివిజన్ బీజేవైఎం డిమాండ్ చేసింది. సంబంధిత విషయంలో మంగళవారం బీజేవైఎం భైంసా డివిజన్ ప్రతినిధి గంగాప్రసాద్ నేతృత్వంలో బస్ పాస్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వానికి, సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం ప్రతినిధి గంగా ప్రసాద్ మాట్లాడుతూ బస్‌పాస్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఇప్పటికే ఖర్చుల ఒత్తిడితోనున్న విద్యార్థుల తల్లితండ్రులు, ఇతర బస్ పాస్ వినియోగదారులు ఆర్థిక ఇబ్బందుల పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే చార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలన్నారు. ఇందులో పార్టీ ప్రతినిధులు బండారి అశోక్, సాయి కుమార్, గణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

శాంతినగర్ తండాలో విరిగిపడిన చెట్లు

సారంగాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం రాత్రి ఉరుములు మెరుపులతో పాటు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఆలూర్, ధని, చించొలి (బి), జాం గ్రామాలలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసిన వర్షానికి నిర్మల్ స్వర్ణ రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి.

కారులోనే దివ్యాంగురాలి వాంగ్మూలం నమోదు



కారులోనే వాంగ్మూలం నమోదు చేసుకున్న మేజిస్ట్రేట్

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కోర్టులో మంగళవారం ఒక క్రిమినల్ కేసులో సాక్షి అయిన సాదు ఇందిరమ్మ అనే దివ్యాంగురాలు కారు దిగి కోర్టులోకి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంది. లక్ష్మణచాంద పోలీసుల అభ్యర్థన మేరకు ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రవీందర్ ఏపీపీ న్యాయవాదులు అందరూ కారు వద్దకే వచ్చారు. సాక్షి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.

కొత్త రేషన్‌కార్డులకు తక్షణమే

బియ్యం సరఫరా చేయాలి

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తరేషన్ కార్డులకు తక్షణమే నిత్యావసర బియ్యం సరఫరా చేయాలని తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొత్తగా వచ్చిన అన్ని రేషన్ కార్డులకు తక్షణమే బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తొడసం శంభు, కే.సంతోష్, కే.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి ఫిర్యాదుల స్వీకరణ వాయిదా

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భైంసా క్యాంపు ఆఫీస్‌లో బుధవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ వాయిదా వేశామని ఎస్పీ డా.జి.జానకీషర్మిల ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతల సంక్షేమానికి పాటుపడాలి

భైంసా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగుబడి విధానాలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తూ వారి సంక్షేమానికి ఆత్మ కమిటీలు అంకితభావంతో పాటుపడాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావ్ పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన భైంసా, ముథోల్ ఆత్మ కమిటీల చైర్మెన్లు సిద్ధం వివేకానంద, గన్ను నర్సారెడ్డిలతో పాటు ఆయా కమిటీల డైరెక్టర్లకు సన్మానం నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రణాళికబద్ధమైన విధానాలు, బాధ్యతాయుతమైన చర్యల ద్వారా రైతాంగ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు.ఆదర్శవంతమైన తీరుతో మార్గదర్శకంగా కమిటీలు పని చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ చైర్మెన్లు, పలువురు డైరెక్టర్లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యంరెడ్డిలతో పాటు ఆయా ప్రాంతాల కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి.

అధిక యూరియా వాడకం అనర్థం

కుంటాల, జూన్, 10 : (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియాను మోతాదుకు మించి వాడడం వలన నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఏరువాక కేంద్రం ముథోల్ శాస్త్రవేత్తలు నర్సయ్య, విజయ్‌కుమార్, కార్తీక్‌లు అన్నారు. మంగళవారం కుంటాల మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త నర్సయ్య రైతులకు జీవ ఎరువుల వాడకం, రసాయనిక, పురుగుల మందుల వాడకం గురించి అవగాహన కల్పించారు. యూరియా తక్కువ మోతాదులో వాడాలని, పంట మార్పిడి చేపట్టాలని, పత్తి, సోయా, వరి పంటలకు ఉపయోగించే ఎరువుల గురించి రైతులకు వివరించారు. పంట పొలాల్లో నీటి కుంటలు, ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారులు తదితరులు ఉన్నారు.


భారీ వర్షానికి ఇంటి పై పడి నేలకొరిగిన చెట్టు, విద్యుత్ వైర్లు


నేలకొరిగిన విద్యుత్ స్తంభం


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గాలివాన బీభత్సం

- ఆదిలాబాద్‌లో నేలకొరిగిన వృక్షాలు, కరెంట్ స్తంభాలు
- తెగిపడిన విద్యుత్ తీగలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ఆయా కాలనీల్లో కరెంట్ పోల్స్, చెట్లు నెలకొరిగాయి. కలెక్టర్ కార్యాలయం రోడ్డులో భారీ వృక్షాలు గాలికి కరెంట్‌పై పడిపోయాయి. చెట్లు రోడ్ల పై పడిపోవడంతో కలెక్టర్ చౌరస్తా నుంచి సంజయ్‌నగర్‌కు వెళ్లే దారిని ట్రాఫిక్ పోలీసులు మూసివేసి ట్రాఫిక్‌ను విద్యానగర్ మీదుగా మళ్లించారు. జేసీబీ, క్రేన్‌ల సాయంతో రోడ్ల పై పడిన చెట్లను తొలగించారు. భారీ వర్షం, ఈదురుగాలులకి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రహారీ కూలిపోయింది. కరెంట్ వైర్లు తెగి రోడ్డున పడిపోయాయి. రాత్రి గాలి వానతో చెట్లు పడిపోవడంతో వెంటనే విద్యుత్ సిబ్బంది ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతోపాటు కేఆర్‌కేకాలనీ, విద్యానగర్, శాంతినగర్, ఇందిరమ్మకాలనీ, అంబేద్కర్‌నగర్ తదితర కాలనీల్లో కరెంట్ పోల్స్ పడిపోవడంతో విద్యుత్ సరఫరా రాత్రి నుంచి నిలిచి పోయింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు విద్యుత్ సిబ్బంది విశ్రాంతి లేకుండా వైర్లు, కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే భారీ గాలులకు ఇంటిపై కప్పులు, షాపుల వద్ద ఉన్న హోర్డింగ్‌లు ఎగిరిపోయాయి. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడలో ఓ ఇంటి పైకప్పు పూర్తిగా ఎగిరిపోయింది. ఇంట్లోని సామగ్రి కూడా పూర్తిగా తడిసిపోయింది. నష్టపోయిన తమను ఆదుకోవా లని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.


భారీ వర్షానికి కూలిన ప్రహారీ

క్రేన్లతో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది


జాతీయ రహదారిపైకి వస్తున్న మిషన్ భగీరథ లీకేజీ నీరు

మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీకేజీ

- జాతీయ రహదారిపైకి భారీగా నీరు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



దిలావర్‌పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్గాపూర్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిల్ వాల్వ్ నుంచి నీరు లీకేజీ అయ్యింది. 61వ జాతీయ రహదారి పైకి నీరు ఎగజిమ్మింది. జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గతేడాది కూడా ఇక్కడే నీరు లీకేజీ అయినా కంటి తుడుపుగా మరమ్మతులు చేసి వదిలేస్తుండటంతో సమస్య పునరావృతమైంది. మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే తరుచూ లీకేజీలతో నీరు వృథా అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన లీకేజీ సాయంత్రం వరకు కొనసాగింది. ప్రయాణికులు మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందించినప్పటికీ తొందరగా స్పందించకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లీకేజీతో రోడ్డుపైకి ప్రెషర్‌తో ఎగజిమ్మాయి. దీంతో ప్రయాణికులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై కాకుండాచెట్ల పొదల్లోంచి రాకపోకలు సాగించారు. 4గంటల పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్పాల సయ్యాట..!


పంటచేనులో ఆడుతున్న పాములు

ఇచ్చోడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తొలకరి వేళ.. పచ్చని చిగుళ్లు చిగురిస్తున్న ఆహ్లాదకర వాతావరణంలో మనుషులకే కాదు.. జంతువులకూ పులకరింపజేస్తుంది. అలాంటి చిత్రమే ఇచ్చోడ మండలం జామిడి గ్రామంలోని ఓ రైతు పంట పొలంలో రెండుపాములు జతకట్టి సయ్యాటలడాయి. దాదాపు గంట పాటు ఒకదానితో మరొకటి చుట్టుకుని ఆటలాడాయి. ఈ దృశ్యాలను అక్కడున్న ప్రజలు తమ ఫోన్లలో బంధించడంతో ప్రస్తుతం ఆ వీడియో నెట్టింటా వైరలవుతోంది.


దంతన్‌పల్లి చౌకధరల దుకాణం వద్ద బియ్యం కోసం పడిగాపులు కాస్తున్న గిరిజనులు

3నెలల బియ్యం కోసం ముచ్చెమటలు

- రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి లబ్ధిదారుల పడిగాపులు

ఉట్నూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న మూడు నెలల ఉచిత బియ్యం పొందేందుకు ప్రజలకు ముచ్చెమటలు పడుతున్నాయి. బియ్యం నిల్వల కోసం గిడ్డంగులు లేకపోవడంతో ప్రభుత్వం ప్రతీ రేషన్‌కార్డు దారునికి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి పంపిణీ చేయడానికి ఆదేశాలు జారీచేసింది. ఉట్నూర్ ఏజెన్సీలోని రోడ్డు సౌకర్యం లేని గ్రామీణ గిరిజన ప్రాంతాల ప్రజలకు వానాకాలం సరుకులు నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన 3 నెలల బియ్యం పంపిణీ కలిసి వచ్చింది. ఉట్నూర్ మండలంలో 32 చౌకాధరల దుకాణాలు, ఇంద్రవెల్లి మండలంలో 10 చొప్పున ఉట్నూర్ డివిజన్‌లో 72 చౌకా ధరల దుకాణాలు ప్రజాపంపిణీ విధానం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్కడక్కడ గిరిజన సహకార సంస్థ డీఆర్‌డీపోలకు కూడా రేషన్ సరుకులు పంపిణీ చేసే విధంగా వెసులుబాటు కల్పించింది. ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి చౌకా ధరల దుకాణంలో 650కి పైగా రేషన్‌కార్డులు ఉండడంతో రోజుకు 20 కార్డుల లబ్ధిదారులకు సరుకులు ఇవ్వడం జరుగుతుందని, సిగ్నల్ సరిగ్గా లేకపోతే అది కూడా ఇబ్బందులు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.


లక్కారం రేషన్ దుకాణం వద్ద బియ్యం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

భైంసా మార్కెట్‌లో ఖరీఫ్ సందడి

భైంసా, జూన్10 (ఆంధ్రజ్యోతి): అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుండడంతో భైంసా మార్కెట్‌లో వానా కాలపు సందడి కనిపిస్తోంది. మృగశిర కార్తె మొదలైన నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు సంసిద్ధులవుతున్నారు. ఇందులో భాగంగానే విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన ఇతర సామగ్రి కొనుగోలు చేపట్టేందుకు భైంసాలోని మార్కెట్‌కు అధికంగా తరలివస్తున్నారు. దీంతో ఇన్నాళ్ల వరకు నామమాత్రపు కొనుగోళ్లతో బోసిపోయి కనిపించిన స్థానిక మార్కెట్ యార్డు రెండు రోజులుగా కళకళలాడుతోంది. సోమవారం డివిజన్ పరిధిలోని అధిక శాతం రైతులు కొనుగోళ్లు చేపట్టేందుకు గాను మార్కెట్‌కు తరలివచ్చారు. గాంధీగంజ్‌తో పాటు ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసిన రైతులు విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు సామగ్రి కొనుగోళ్లు చేయడం, వాటిని తమ స్వస్థలాలకు తరలించడం లాంటి పనులు నిర్వహిస్తూ బిజీబిజీగా కనిపించారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తమ వ్యవసాయ భూములను విత్తనాలు విత్తేందుకు దుక్కులు దున్నడం, చదును చేయడం పనులను వేగం చేశారు.


విత్తన విక్రయ కేంద్రంలో రైతుల సందడి

మీకోసం


పిడుగులు పడినప్పటి దృశ్యాలు


సెల్ టవర్

పిడుగుల కాలం అప్రమత్తత అవసరం

- జాగ్రత్త చర్యలు పాటిస్తే తప్పుతుంది ప్రాణాపాయం

భైంసా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పొలాలకు వెళ్లే రైతులకు పిడుగుపాటు భయం మొదలైంది. గత రెండు రోజులుగా పిడుగుల ప్రభావం పెరిగింది. సోమవారంరాత్రి జిల్లాలోని పలు ప్రాంతంలో పిడుగుల పడ్డాయి. ఖానాపూర్ ప్రాంతంలో పిడుగుపాటు బారిన పడి మూగజీవి ఒకటి మృత్యువాత పడగా కొన్ని ప్రాంతాల్లో ఆస్తి నష్టం వాటిల్లింది. భైంసాలో పిడుగుపాటుకు పలువురి ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతిన్నాయి. మిగతా కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ కొద్ది మేర ఆస్తి నష్టాల జరిగాయి. గత యేడు వర్షకాలం అరంభంలో పిడుగుల ప్రభావం దాటికి జిల్లాలో పలువురు మృత్యువాత పడగా పదులసంఖ్యలో మూగజీవాలు చనిపోయాయి. ప్రస్తుతం పిడుగుల ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో పిడుగుపాటుపై అవగాహన పెంచుకోవడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

● ఎలా సంభవిస్తుంది?

మేఘాల నుంచి భూఉపరితలాన్ని తాకే శక్తిమంతమైన ప్రవాహం పిడుగు. వాతావరణం చల్లబడినప్పుడు మేఘాలలో ద్రవ, ఘన పదార్థాలు ఉత్పన్నమవుతాయి. వీటిని బలమైన గాలి తోడైనప్పుడు నీరు, మంచు బిందువులు మధ్య రాపిడి ఏర్పడుతుంది. ఫలితంగా మేఘాలలో కొన్ని వేలకోట్ల పాజిటివ్, నెగటివ్ చార్జిలు ఏర్పడతాయి. ఇవి ఒక దానికొకటి ఆకర్షించుకున్నప్పుడు అమితమైన విద్యుచ్ఛక్తి వేడిపుడుతుంది. ఇక పిడుగు సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు శక్తిని కలిగి ఉంటుంది. పిడుగులు చుట్టూ ఉన్న గాలిని రెప్పపాటులో వేడెక్కించి భయంకరమైన శబ్దాన్ని సృష్టిస్తాయి. వర్షం కురిసే సమయంలో కేవలం మేఘాలలోనే కాదు నేలపై ఉండేఎత్తైన ప్రదేశాలు, చెట్లు, లోహలవంటి వాటిపై కూడా పిడుగులు పడుతుంటాయి. ఎత్తైన చెట్లు, అపార్టుమెంట్లు, విశాల మైదానాలు భవనాలు, డాబాలు, కరెంటు స్తంభాలు వంటి లోహాలు పిడుగులను ఆకర్షిస్తుంటాయి. పిడుగుపాటుకు గురైన వాళ్ల తర్వాత జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, పక్షవాతం వంటి శారీరక సమస్యలకు గురవుతున్నారు.

ఏం చేయకూడదు?

- వర్షం పడుతున్న సమయంలో ఎత్తయిన చెట్లు, సెల్ టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు. విద్యుత్తు నియంత్రికలకు దూరంగా ఉండాలి.


ఇంటికి ఎర్తింగ్ ఏర్పాటు ఇలా..

- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, గేమ్ సిస్టమ్‌లు, విద్యుత్తు స్టవ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు ఉపయగించవద్దు. వర్షం కురిసినప్పుడు విద్యుత్తు సరఫరా హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- గుంపులుగా కాకుండా దూరంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల సమయంలో స్నానాలు వంటివి చేయరాదు. ఇనుప కడ్డీలు ఉన్న గొడుగులు వాడరాదు.
- పొలాల్లో పని చేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దు. ప్రయాణాలు చేయకపోవడం మంచిది. చెరువులు, కుంటలు, ఈతకొలనులు వంటి బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- తలదాచుకునేందుకు ఆశ్రయం లేనప్పుడు తనకు తానుగా మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా బంతిలా ముడుచుకొని కూర్చోవాలి. చెవులు మూసుకోవడం ద్వారా తరంగాలు లోపలికి వెళ్లకుండా చూడాలి.
- భూమిపై అరికాళ్లు అనించకుండా వేళ్లపై నిల్చోవాలి. నీటిలో ఉంటే సాధ్యమైనంత వరకు తొందరగా బయటకు రావాలి.
- అటవీ ప్రాంతంలో ఉంటే మరుగజ్జు, చిన్నచెట్ల కింద ఆశ్రయం పొందాలి.

ఇంటికి ఎర్తింగ్ తప్పనిసరి

పిడుగు పడే వాతావరణ ఉందన్నప్పుడు ఇంట్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. ఆ సమయంలో ఓల్టేజి వచ్చి విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతింటాయి. నివారణకు తప్పనిసరి ప్రతీ ఇంటికి ఎర్తింగ్ చేయించాలి. ఫ్యూజులకు సరైన రేటింగ్ కలిగిన తీగను ఉపయోగించాలి. విద్యుత్తు బోర్డుల నుంచి ప్లగ్‌ను తొలగిస్తే పూర్తి రక్షణగా ఉంటుంది.

ముందే తెలుస్తుంది..

ఇప్పుడున్న ఆధునాతన పరిజ్ఞానం ద్వారా 30 నుంచి 40 నిమిషాల ముందే పిడుగు పడే ప్రదేశాన్ని గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అలాంటప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండడం మంచిది.

జాగ్రత్తలే రక్ష ; ఎం. రవి , అగ్నిమాపక అధికారి, భైంసా



ఉరుములు, మెరుపులు ఉండేటప్పుడు బయటకు తిరగడం ఆపివేయాలి. ఎవరికి వారు స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. వస్తువులకు భద్రత ముఖ్యం. పంట చేలలో చెట్ల కింద ఉండకూడదు. పిడుగులు పడే సమయంలో సెల్ ఫోన్ల వినియోగం ఆపివేయాలి. పిడుగుపాటు బారిన పడ్డ వ్యక్తులను తక్షణమే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలి.

కొత్త రేషన్ కార్డులకు బియ్యం పంపిణీ చేయాలి

- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులకు సైతం తక్షణమే నిత్యావసర బియ్యం పంపిణీ చేయాలని తెలంగాణ ఆదివాసి సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన అన్ని రేషన్ కార్డులకు తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో తొడసం శంభు, కే.సంతోష్, కే.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. నాటు పడవలో ప్రయాణం

- ప్రతీ వర్షాకాలం తాంసీ, భీంపూర్, తలమడుగు ప్రజల రాకపోకలు
- అధికారులు హెచ్చరించినా.. ఆగని ప్రయాణం
- వంతెన లేకనే ఈ కష్టాలంటున్న ప్రజలు

భీంపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే తాంసీ, భీంపూర్, తలమడుగు మండలాల ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. చివరికి ప్రమాదమని తెలిసినా నాటు పడవలోనే రాకపోకలు సాగిస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. ప్రమాదని అధికారులు హెచ్చరించినా గత్యంతరం లేక నాటు పడవల్లోనే తమ గమ్య స్థానం చేరుకుంటున్నారు. వర్షాకాలం పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. అయినప్పటికీ ప్రజలకు నాటు పడవలే శరణ్యం అవతున్నాయి. వంతెన నిర్మిస్తే ఈ ప్రమాదకర ప్రయాణం తామెందుకు చేస్తామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నాటు పడవల ప్రయాణం వల్ల గతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నా వేరే దారి లేదని ప్రజలు ప్రయాణం తప్పదంటున్నారు. అంతర్గం నుంచి మహారాష్ట్రలో ఉన్న సాగ్ధ వరకు వంతెన నిర్మిస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు నాయకులు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. వర్షాకాలం వచ్చింది అంటే ప్రాణాలను అరితేతిలో పెట్టుకొని బతుకుతున్నామని ఆవేదనకు గురవుతున్నారు. తాంసీ, భీంపూర్, తలమడుగు మండలాల ప్రజలు వర్షాకాలంలో నిత్యం నాటు పడవలో రాకపోకలు సాగిస్తున్నారు. వాడుర్ నుంచి అర్లి, గొల్లగాడ్ నుంచి మహారాష్ట్ర, తాంసికే నుంచి శంకర మహారాష్ట్ర పరిసరాల ప్రాంతాలకు రోజూ వందలాది మంది నాటు పడవలో ప్రయాణిస్తున్నారు. పెన్‌గంగలో నీటి ఉధృతి వల్ల నాటు పడవలకు ఏదైనా ప్రమాదం జరిగి తే అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ఎవరూ బయటపడే ఆస్కారం ఉండదు.


నాటు పడవపై ప్రయాణం చేస్తున్న దృశ్యం (ఫైల్)

● వంతెన నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

మండలంలోని అంతర్గం వద్ద పెన్‌గంగా నదిపై వంతెన నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఈ ప్రాంత వాసులు అభిప్రాయ పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నాటు పడవలో ప్రయాణించాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలోనే ఈ నాటు పడవలను ఆశ్రయించవసుందని ప్రయాణానికి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్గం వద్ద పెన్ గంగ నదిపై వంతెన నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడని వలువురు కోరుతున్నారు.

వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు మేలు



● గోవర్ధన్‌రెడ్డి, రైతు, థామస్‌దారి గ్రామం

అంతర్గం, మహారాష్ట్రసాగ్దా నడుమ పెన్‌గంగాపై వంతెన నిర్మిస్తే మహారాష్ట్రతోపాటు తెలంగాణ ప్రజల ఎంతోమేలు జరుగుతుంది. ఆసుప త్రికి రావాలంటే 60 కిలోమీటర్ల రవాణా భారం పడుతోంది. అక్కడ పండించే కూరగాయలు, మిర్చి, వ్యవసాయం కోసం ఎద్దులు కొనడానికి హింగన్ ఘాట్, ఘటన్జీ లాంటి ప్రాంతాలకు రైతులు ఎక్కువగా వెళ్తుం టారు. వంతెన నిర్మిస్తే వారికి రవాణా భారం తగ్గుతోంది.


అంతర్గం వద్ద వంతెన నిర్మించాలి



● బక్కి, కపిల్, అంతర్గం వాసి

అంతర్గం పెన్‌గంగా నదిపై వంతెన నిర్మిస్తే మా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇక్కడ పండించిన పంటలను అక్కడికి, పండించిన పంటలు ఇక్కడికి రవాణా సౌకర్యం ఉంటుంది. గిట్టు ధరకు అమ్ముకునే వీలుంటుంది. ముఖ్యంగా మిర్చి రైతులు ఈ ప్రాంతంలో ఎక్కువ ఉన్నారు. ఎద్దుల కోసం ఘాటంజి, హింగన్ గాట్ బజార్‌లకు వెళ్తూ ఉంటాం. ఈ వంతెన నిర్మాణంతో అందరికీ ఎంతో మేలు కలుగుతుంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 38.3 కనిష్టం 21.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 11 జూన్ 2025



ఉద్యాన పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ఆదిలాబాద్‌అర్బన్/మావల,జూన్10 (ఆంధ్రజ్యోతి)శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవిశ్వవిద్యాలయం ఉద్యాన పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ డా.వి.మురళి తెలిపారు. మంగళవారం ఆయన కళాశాలలో ప్రవేశాల గురించి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.వి.మురళి మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గాను40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్‌స సెక్టార్‌లో కూడా మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు, పాలిసెట్ రాసిన, రాయక పోయిన అర్హుల న్నారు. అడ్మిషన్ ఫీజు ఎస్సీ ఎస్టీలకు రూ.600లు, ఇతరకలుకు రూ.1100 ఉంటుందన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ఆసుపత్రి నిర్మాణం

● ఎమ్మెల్యే పాయల్ శంకర్



క్రిటికల్ కేర్ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్‌శంకర్

ఆదిలాబాద్‌అర్బన్,జూన్10(ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. మంగళవారం రిమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రిని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్‌శంకర్ మాట్లాడుతూ రూ.23కోట్ల కేంద్రం నిధుల వ్యయంతో ఆసుపత్రిని నిర్మించడం జరిగిందని,నిర్మాణపనులు పూర్తయ్యాయని తెలిపారు.కార్పొరేట్‌కు ధీటుగా ఆసుపత్రిని నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు.జిల్లాకు సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రి, క్రిటికల్ కేర్ ఆసుపత్రి అందించిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి దానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో క్రిటికల్ కేర్ ఆసుపత్రి ప్రారంభించడానికి కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రులతో పా టు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. ఇందు లో నాయకులు ఆకుల ప్రవీణ్, కృష్ణయాదవ్, భరత్, రాకేష్ తదితరు లున్నారు.

యోగా సాధనతో సాకారత్మక ఆలోచనలు

సోనాల, జూన్10(ఆంధ్రజ్యోతి):యోగా సాధనతో సాకారత్మక ఆలోచనలు పెంపొందించ బడుతాయి అని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సచిన్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుంది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పాల, మధుసూదన్,యోగిత, కృష్ణవేణి, సులోచన, సూర్య, అనిల్, శ్రీధర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేకు సన్మానం



బొజ్జుపటేల్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ఉట్నూర్, జూన్10 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని ప్రజా భవనంలో రాష్ట్ర పంచా యతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కని మంగళవారం ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమి తులైన, ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మబొజ్జు పటేల్‌ని శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ తదితరు లున్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు!

- ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామంటున్న ప్రభుత్వం
- యథేచ్ఛగా అధిక ధరలకు అమ్మేసుకుంటున్న ఇసుక మాఫియా
- ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి 7 వేల వరకు ధర
- ఇసుక కొరతతో నిలిచిపోతున్న నిర్మాణాలు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



భీంపూర్ మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు



జిల్లా కేంద్రంలోని తిరుపెల్లి కాలనీలో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన ఇసుక

ఆదిలాబాద్, జూన్10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. ఇటుక, సిమెంట్, ఇనుము ధరలతో పాటు ఇసుక ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల ఆర్థిక సాయం ఏ మాత్రం సరిపోదంటున్నారు. మొదటి విడతలో 2067 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 6907 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో దాదాపు అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఒకేసారి ప్రారంభమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. క్షేత్ర స్థాయిలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు కని పిస్తున్నాయి. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇసుక వ్యాపారులు అడ్డగోలుగా అమ్మేసుకుంటు దండుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడ అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోయినా జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది నుంచి ఇసుకను తరలిస్తూ విచ్చలవిడిగా అమ్మేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలి స్తున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్న ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు.

అనుమతుల పేరిట అక్రమ దందా

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తరలించేందుకు తప్పనిసరిగా టోకెన్ తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం నకుంచి టోకెన్ తీసుకుంటేనే అధికారులు అనుమతిస్తున్నారు. అయితే అనుమతుల పేరిట కొందరు అక్రమదందాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అమాయక నిరుపేద లబ్ధిదారులు మాత్రం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగే ఓపిక లేక వ్యాపారుల వద్ద అధిక ధరలకు ఇసుకను కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. ఇదే అదునుగా ఇసుక వ్యాపారులు అడ్డగోలుగా ఇసుకను తరలిస్తూ దండుకుంటున్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తరలించాలంటే టోకెన్ తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కాని ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్న అధికారులు అడ్డుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.

డిమాండ్‌ను బట్టి ధర

ఇసుక డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ధరలను నిర్ణయిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అని అధికారులు చెబుతున్నా ధరలు మాత్రం అమాంతంగా పెరిగిపోతున్నాయి. జిల్లా కేంద్రంలో ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.4వేలనుంచి రూ.7వేల వరకు ధర పలుకుతుంది. భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లో మాత్రం ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.2500 నుంచి రూ.3500 వరకు విక్రయిస్తున్నారు. కేవలం ఇసుకను తీసుకొచ్చుకునేందుకే అధికారులు అనుమతులు ఇస్తున్నా రవాణా ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ట్రాక్టర్లు దొరకడం లేదని వాపోతున్నారు. అసలే వానాకాలం ప్రారంభంకావడంతో ధరలు మరింతగా పైపైకి వస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఇసుక ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు ధరల నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారు.

ఆగుతూ.. సాగుతున్న పనులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా ఇసుక కొరతతో ఇందిరమ్మ

మిగతా 6వ పేజీలో...

లబ్ధిదారులకు అనుమతులు ఇస్తున్నాం..

: రవీందర్ జిల్లా మైనింగ్ అధికారి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి చార్జీలు లేకుండానే ఇసుక రవాణాకు అనుమతులను ఇస్తున్నాం. సంబంధిత తహసీల్దార్ నుంచి టోకెన్లను జారీ చేయడం జరుగుతుంది. దీని ప్రకారమే లబ్ధిదారులు ఇసుకను తీసుకొచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. బయట మార్కెట్లో విక్రయిస్తున్న ఇసుక ధరలు మా దృష్టికి రాలేదు పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

● అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

సోనాల, జూన్10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని టీవీటీ గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సు పరిశీలించారు. సదస్సులో రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు తప్పకుండా కృషి చేయాలని సూచించారు.రైతులు తమభూసమస్యలకు పరిష్కారానికి రెవెన్యూసదస్సును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌అర్బన్, జూన్10 (ఆంధ్రజ్యోతి):ఈదురు గాలుల బీభత్సవానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నిలిచి పోయిన విద్యుత్ సరఫరా మంగళవారం రాత్రి వరకు పునరుద్ధరించకపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని పలు కాలనీలతో పాటు చాలా గ్రామాలు ఇంకా అంధకారంలోనే కనిపిస్తున్నాయి. అసలు ఎప్పుడు విద్యుత్‌ను సరఫరా చేస్తారనే దాని పై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. 24గంటల పాటు సరఫరా నిలిచి పోవడంతో చార్జింగ్ లేక సెల్‌ఫోన్‌లు మూగబోయాయి. అలాగే గృహ అవసరాల కోసం తీవ్రమైన నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంఈవో

నేరడిగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని మండల విద్యాధికారి భూమారెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా గంగాధర్ వ్యవహరించారు.

ఉట్నూర్:పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత శానిటేషన్ సిబ్బందిదేనని మండల విద్యాధికారి ఆశన్న అన్నారు. ఒక్క రోజు శిక్షణ లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆశన్న మాట్లాడుతూ తరగతి గదులతో పాటుగా టాయిలెట్స్ మరియు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సానిటేషన్ వర్కర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బొబ్బిలి సుధాకర్ వివిధ పాఠశాలల సానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పారిశుద్ధ్య సిబ్బందికి సవివరముగా శిక్షణ ఇచ్చారు.

ఆదిలాబాద్‌అర్బన్:ఈ నెల12 నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో పరిసరాలతో పాటు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదిలాబాద్‌రూరల్ ఎంఈఓ కంటెనర్సయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్కావెంజర్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. స్కావెంజర్ల బాధ్యతలు, పనులను తెలియజేస్తూ ఆర్‌పీ ప్రభాకర్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రంతో పాటు నాటిన మొక్కల సంరక్షణ కోసం స్కావెంజర్లను నియమించిందన్నారు.

నేరాల నియంత్రణకు పోలీసు సబ్ కంట్రోల్‌రూమ్‌లు

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ● శివాజిచౌక్‌లో పోలీసు సబ్‌కంట్రోల్‌రూమ్ ప్రారంభం



పోలీసు సబ్‌కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్,జూన్10(ఆంధ్రజ్యోతి):నేరాలనియంత్రణకు పోలీసు సబ్ కంట్రోల్ రూమ్‌లు దోహద పడతాయని జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు.మంగళవారం శివాజిచౌక్‌లో ఎస్‌బీఐ బ్రాంచ్ సహకారంతో పోలీసు సబ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగాహాజరై పూజలు చేసి ప్రారంభించారు. ముందుగా బ్యాంక్ సిబ్బంది జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శివాజి చౌక్ ప్రాంతం అను నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలతో రద్దీగా ఉంటుంద న్నారు.ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు, ఎలాంటి నేరాలు జరుగ కుండా,పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడానికి, అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే అత్యవసర సమయంలో స్పందించే విధంగా సబ్‌కంట్రోల్ రూమ్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు బి.సునిల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, మున్సిపల్ డీఈఈ కార్తిక్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జి.రామచంద్రరావు, సత్యనారాయణ, సురేష్, శ్రీధర్, ఉత్పల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: నిరుద్యోగ యువత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని, అప్పుడే వారి తల్లిదండ్రులు కన్నా కలలు సహకారం అవుతాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆయన డీఎస్పీ జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్‌లతో కలిసి మంగళవారం పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుబిడి, టెక్డి రాంపూర్, కరంజీ టి,భగవాన్ పూర్ గ్రామాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పీర్ సింగ్ నాయక్, గ్రామ పెద్దలు గుర్ల నరేందర్, మేకల ప్రవీణ్, యువరాజ్, ఇస్తారి తదితరులు ఉన్నారు.

ప్రీమియం చెల్లించే పరిస్థితిలో ప్రభుత్వం లేదు : జోగు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్,జూన్10(ఆంధ్రజ్యోతి):రైతుబీమాపథకానికి కనీసం ప్రీమియం చెల్లించే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతల సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. రైతులు అమ్మిన జొన్న పంట నగదును విడుదల చేయడంతో పాటు రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం అందించాలన్నారు.గత నాలుగైదు నెలల్లోనే 40 మంది రైతులు చనిపోతే వారికి రైతు భీమా అందలేదని,బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో వారం రోజుల్లోగా రైతులు పండించిన పంటలకు నగదు జమ అయ్యేదని, ప్రస్తుతం నెలలు గడుస్తున్నా పంటల నగదును విడుదల చేయడం లేదని మండిపడ్డారు. కేంద్రం ప్రభుత్వం పీఎం కిసాన్‌సమ్మాన్ యోజన కింద ఈ యేడాది కేవలం 65వేల మంది రైతులను ఎంపిక చేయగా అందులో 37వేల మందికి కిసాన్ సమ్మాన్ యోజన రాలేదన్నారు. రైతులకు మేలు చరేసే పథకాల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.రైతులకు అందించాల్సిన ఎరువులు, మందుల రేట్లను గణనీయంగా పెంచేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చని పక్షంలో వారికి అండగా ఉంటూ బీఆర్ ఎస్ తరపున పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో మాజీ మార్కెట్ చైర్మన్లు యాసంనర్సింగ్‌రావు, మెట్టు ప్రహ్లాద్, గంధ్రత్‌రమేష్, చందాల రాజన్న, బట్టుసతీష్, కుమ్రరాజు, దయానంద్, జంగిలి ప్రశాంత్, మహేశ్,సూర్యకాంత్, కలీం తదితరులున్నారు.

జైనథ్:ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ నియోజక వర్గంలోని ఆయా గ్రామాలలో ఈదురు గాలులు వర్షానికి ఇండ్లు నేలమట్టం అయ్యాయని బాధితులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని ఆకూర్ల గ్రామంలో ఈదురు గాలుల వర్షాలకు నేలమట్టమైన ఇండ్లను బాధితులతో కలిసి పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి నష్ట పరిహారం ఇప్పించే విధంగా అధికారులు దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.ఆకూర్ల గ్రామంలో సయ్యద్ ఉమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. రైతులకు రైతుభీమా అందకపోవడం బాధకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుభాష్‌టాక్రె, సయ్యద్‌సర్దార్, దిగంబర్, విఠల్‌గౌరి, నీకంయాదవ్‌లతో పాటు ఆకూర్ల గ్రామప్రజలు పాల్గొన్నారు.

రెండో రోజు డీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

● 620 మంది అభ్యర్థుల హాజరు

మావల , జూన్ 10 (ఆంధ్రజ్యోతి): డీ సెట్- 2025 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ప్రశాంతంగా కొనసాగుతుంది. డీసెట్ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెండవ రోజు 850 మందికి గాను 620 మంది హాజరయ్యారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 13 వరకు కొనసాగుతుందని ఇంచార్జి ప్రిన్సిపాల్ కోలా కిరన్ తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తప్పకుండా తీసుకురావాలన్నారు. అదే విధంగా 2025 సంవత్సరం ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలని సూచించారు. ఇందులో సూపరింటెండెంట్ మమత, అధ్యాపకులు ఉమాకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, విజయలక్ష్మీ, శివకుమార్, గంగామణి, ప్రియాకం, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ కెఫిటేరియా ప్రారంభోత్సవంలో బోథ్ ఎమ్మెల్యే



మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంకు ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫిటేరియాను రాష్ట్ర మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహచర ఎస్టీ ఎమ్మెల్యేలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి, ఎస్టీ ఎమ్మెల్యేలు, ట్రైబల్ చైర్మన్‌తో కలిసి నూతనంగా ప్రారంభించిన ట్రైబల్ కెఫిటేరియాలో భోజనం చేశారు.

● వర్షాల దృష్ట్యా బోథ్ నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ అధికారులు సూచన మేరకు జిల్లాలో రానున్న 23 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బోథ్ నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్ష సూచన ఉంది కాబట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు చేరుకోవాలని అవసరం అయి తే తప్ప ఎవరూ బయటికి రావొద్దని ఇలాంటి సమయాల్లో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. ఎక్కడ సమస్య ఉన్న ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ప్రజల కొరకు తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు.

రోడ్డెక్కిన రైతులు

● జొన్నల డబ్బులు విడుదల చేయాలని రాస్తారోకో



రోడ్డుపై ఆందోళన చేపడుతున్న రైతులు

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, జూన్10 (ఆంధ్రజ్యోతి) : జొన్న పంట కొనుగోలు చేసిన ప్రభుత్వం నాలుగు నెలలైన డబ్బులు చెల్లించట్లేదని రైతులు ఆందోళన బాట పట్టారు. మండలంలోని రైతులు మంగళవారం రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరవులు కొందాం అంటే చేతిలో చిల్లిగవ్వ లేక వ్యాపారుల వద్ద చేయ్యి చాపాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతు బంధు పెంచి రైతుభరోసాగా 15వేల రూపాయలు అందిస్తామని రైతులను మోసం చేశారని మండిపడ్డారు. తక్షణమే రెతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యలయంలో జూనియర్ అసిస్టెంట్ స్రవంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్, వినీల్, విలాస్, సాయన్న, రవి, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.